క్లుప్తంగా

మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: మలేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి (జెడ్ఎంఒ) డాక్టర్ ఎం. శాంతిప్రభ అన్నారు. ఈ మేరకు జిల్లా మలేరియా అధికారి (డీఎంఒ) డాక్టర్ టి. జగన్ మోనరావు, అధికార బృందంతో కలిసి మండలంలోని డోకిశీల, గోచక్క తదితర గ్రామాలను బుధవారం ఆమె సందర్శించారు. మండలంలో మలేరియా ప్రభావిత గ్రామాలలో జరుగుతున్న మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని బల్లేరు గ్రామంలో తనిఖీ చేశారు. ఇంటింటికీ స్ప్రేయింగ్ చేపడుతున్న తీరును పరిశీలించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో జ్వరాలపై ఆరా తీసి నిర్ధారణ పరీక్షలు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫీవర్ సర్వలెన్స్, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తల్లి సంబరం



అమ్మవారికి సమర్పించేందుకు ఘటాలను తీసుకెళ్తున్న మహిళలు

భామిని: మండలంలోని నేరడి–బి గ్రామదేవత బంగారమ్మ తల్లి సంబరాలు బుధవారం వైభవంగా జరిగాయి. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. ఘటాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

భామిని: భామిని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ ఊర కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనచోదకులను వెంటాడుతున్నాయి. రాత్రిపూట రాకపోకలు సాగించే వారిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కలబెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం



కాలు విరిగిన వృద్ధునికి సేవలు అందిస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ కోరారు. కొంకడివరం పంచాయతీ, సీతారాంపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాలను బుధవారం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్యసేవలు అందించారు. ప్రస్తుత సీజన్‌లో వడదెబ్బకు గురికాకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలని వృద్ధులకు సూచించారు. శిబిరంలో వైద్య సిబ్బంది అనిత, మాలతి, రామకృష్ణ, 104 సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

31 నుంచి సాయి సప్తాహం



గరుగుబిల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో 22వ వార్షికోత్సవం, 18వ అఖండ సాయినామ సప్తాహం పూజలును ఈ నెల 31నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 31న శ్రీసాయి అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చన, జూన్1న వేంకటేశ్వరస్వామి లక్ష పుష్పార్చన, 2న సుదర్శన హోమం, 3న రుద్రాభిషేకం, 4, 5న వార్షికోత్సవ పూజలు, 6న మూలవిరాట్‌కు క్షీరాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిరోజు శ్రీసాయి అఖండ నామసంకీర్తన భజనలు సాగుతాయన్నారు. అఖండ సాయినామ ముగింపు రోజున అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పాలకొండ: ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ వరహాలు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌పై రాజకీయ పార్టీల నేతలకు అవగాహన కల్పించామని చెప్పారు. సిబ్బందికి అప్పగించిన బాధ్యతలు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. జూన్ 4న ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

మండే ఎండలకు జాగ్రత్తలే అండ



గుమ్మలక్ష్మీపురంలో ఎండలోనే పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

- వేసవి కాలంలో వాహనాల భద్రత ఎంతో ముఖ్యం
- బైకులకు ఫుల్ ట్యాంక్ పెట్రోల్ వద్దు
- ఎండలో దూర ప్రయాణాలు శ్రేయస్కరం కాదంటున్న నిపుణులు

గుమ్మలక్ష్మీపురం: ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండ నుంచి రక్షణకు మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో.. వాహనాలను సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉండడం వల్ల వాటి రంగు వెలిసిపోతుందని, పెట్రోల్ ఆవిరయ్యే అవకాశం ఉందని రవాణా రంగ ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వాహనాలకు ట్యాంకు నిండా పెట్రోల్ పట్టిస్తే ఒక్కో సారి పేలే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రక్షణ జాగ్రత్తలు వివరిస్తున్నారు. వారి మాటల్లోనే...

- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టు నీడన, షెడ్లలో పెట్టుకోవాలి. లేదంటే కవర్లు కప్పి ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గిపోతుంది. వారానికి ఒక సారి గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.
- గాలి ఎక్కువ కొట్టించడం వల్ల వేడికి టైర్లు పేలిపోతాయి. తగిన మోతాదులో మాత్రమే గాలి నింపుకోవాలి.
- ద్విచక్ర వాహనాలు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరైపోయే అవకాశం ఉంది.
- వేసవిలో పగలు కన్నా సాయంత్రం వేళల్లో పెట్రోలు కొట్టించడం మంచిది.
- గాలికొట్టించడంలో అలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది. తద్వారా పెట్రోల్ ఎక్కువ ఖర్చయ్యే ప్రమాదం ఉంది.
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది.అందుకోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుంది. ని ర్ణీత గడువులోపు ఇంజిన్ ఆయిల్ మార్చుకోవాలి.

పెద్ద వాహనాలకు ఇలా..

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి.
- నీళ్ల కంటే కూలెంట్ ఆయిల్ వాడడం మంచిది.
- వేడికి ఇంజిన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.
- కార్లలో పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వాహనాలు నడిపేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.
- ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలం వెళ్లే వరకూ భారీ వాహనాలకు కొత్త టైర్లను వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గి పేలిపోయే ప్రమాదం ఉంది.

వేసవిలో ఫుల్ ట్యాంక్ వద్దు

ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్‌లకు ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల పేలిపోయే ప్రమాదం ఉంది. రెండు లీటర్ల పెట్రోలు వరకు వేయించుకుంటే ప్రమాదం జరిగే అవకాశమే లేదు. ఒక వేళ బైక్ ఎండలో పెట్టాల్సిన అవసరం ఏర్పడితే ఏదైనా పొడవాటి క్లాత్‌ను ట్యాంక్‌పై కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంకర్ హీటెక్కి పేలిపోయే ప్రమాదం ఉంది. ఎండలో ఎక్కువ దూరం ప్రయాణించకపోవడం మంచిది.

– వై.జానకి, మెకానిక్, ఎల్విన్‌పేట

గరిష్ట వేతనం దక్కేలా పనులు చేయాలి

మక్కువ: వేతనదారులు గరిష్ట వేతనం దక్కేలా కొలతల ఆధారంగా పనులు చేపట్టాలని ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని పనసభద్ర పంచాయతీ దుగ్గేరు, నంద పంచాయతీ పెద ఊటగెడ్డలో జరుగుతున్న చెరువు, రహదారి అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు పనివేళలు సక్రమంగా పాటించాలని కోరారు. ఉదయం నుంచే పనికి హాజరైతే ఎండ తీవ్రత నుంచి తప్పించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. పని ప్రదేశాలలో టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని సిబ్బందికి సూచించారు. మస్తర్లలో తేడాలు వస్తే చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. మస్తర్లను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. వేతనదారులకు బిల్లులు సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గంటలోనే ముగిసిన మండల సమావేశం

- అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు ఎన్నికల కోడ్ అడ్డంకి

సీతంపేట: సీతంపేట మండల సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా గంటలోనే ముగించేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరం ఉన్నప్పటికీ ఫలితం లేకపోయింది. ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం సాదాసీదాగా ముగిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి, సంక్షేమం, ఇతర సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజికపరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు సామాజికపరమైన అభివృద్ధి పనులు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చి, గిట్టుబాటు వేతనం పొందాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అధ్యక్షతన గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై బుధవారం సమీక్షాసమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని, రహదారులకు ఇరువైపులా అభివృద్ధి పనులు చేయడంతో పాటు, రైతుల పంట పొలాలకు రాకపోకలు చేయాల్సిన గోర్జలు, నీరు నిల్వ ఉండాల్సిన చెరువుల్లో పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేతనదారులు పనులు చేస్తున్న ప్రాంతంలో ముందుగా కొలతలు ఇవ్వాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాల్సి ఉంటుందన్నారు. నిర్దేశించిన కొలతల్లో పనులు చేసినపుడే వేతనం గిట్టుబాటవుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, మరో మూడు రోజులు ఎండలతీవ్రత ఇలాగే ఉంటుందని వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ భాను మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, గ్రామ సభల్లో ప్రజామోదం పొందిన పనులను వేతనదారులకు అప్పగిస్తున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్దేశించిన గడువులోగా కొలతలు వేసి పనులు పూర్తి చేయడం వల్ల సకాలంలో వేతనదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమ అవుతున్నాయని చెప్పారు. బుధవారం 11,874 మంది వేతనదారులు పనుల్లో పాల్గొన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కృష్ణ, క్లస్టర్ టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ సహాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లీ.. కరుణించమ్మా..!

- దిమ్మిడిజోలలో వైభవంగా పెద్దమ్మతల్లి సంబరాలు
- మొక్కులు చెల్లించిన భక్తులు
- అమ్మవారి సేవలో పాలకొండ ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



గ్రామదేవతా మండపం వద్ద గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



ఘటాలతో బయలుదేరుతున్న మహిళా భక్తులు



దిమ్మిడిజోల పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని:

మండలంలోని దిమ్మిడిజోల గ్రామ దేవత పెద్దమ్మతల్లి సంబరాలు బుధవారం వైభవంగా సాగాయి. అమ్మవారికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వందలాది మంది మహిళలు ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు అమ్మవారిని దర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల నిర్వహణపై గ్రామ పెద్దలతో చర్చించారు. అవసరమైన సహాయసహకారాలు అందించారు. సంబరాల ముగింపు కార్యక్రమంలో భామిని, కొత్తూరు మండలాలతో పాటు, ఒడిశా గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలిరావడంతో దిమ్మిడిజోల జన సంద్రంగా మారింది. గ్రామంలో ప్రతి ఇంట మాంసాహార విందు భోజనాలు సందడిగా సాగాయి. భక్తుల తాకిడితో ఏబీ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు చొరవతీసుకుని రాకపోకలు క్రమబద్ధీకరించారు.



అమ్మవారి సన్నిధికి ఘటాలను తీసుకెళ్తున్న మహిళలు

గోచక్కలో ఎఫ్‌పీసీ వైద్యశిబిరం



గిరిజన గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని గిరిజన గ్రామం గోచక్కలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 73 మంది రోగులకు వైద్యసేవలు అందించామని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఎఫ్‌పీసీ విధానంలో ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండడం వల్ల ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అంది స్తారన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్తపరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రాష్ట్ర రహదారి



అప్పయ్యపేట-జోగింపేట గ్రామాల మధ్య నిర్మానుష్యంగా రాష్ట్ర రహదారి

సీతానగరం: నిరంతరం వదంలాది వాహనాలు తిరుగాడే మండలంలోని అంతర్‌రాష్ట్ర రాయగడ- విశాఖ ప్రాంతాలకు రాకపోకలు నిర్వహించే వాహనాలు బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా వాహనాల డ్రైవర్లు వేడిని తట్టుకోలేక చెట్లనీడలో ఎక్కడివక్కడే నిలిపివేశారు. ద్విచక్రవాహన చోదకులు పూరిగుడిసెలున్న ఇళ్ల నీడకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలనుంచి 40 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో తారురోడ్డుపై వాహనాలతో ప్రయాణం చేసేవారంతా 12 గంటల సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్ల నీడను ఆశ్రయించారు. ఇదేవాతావరణం మరో మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటన చేయడంతో వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉందని ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

బ్యాంకులకు స్త్రీనిధి రుణాల చెల్లింపు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు

సీతానగరం: మహిళా పొదుపు సంఘాల సభ్యులు బ్యాంక్‌ల నుంచి స్త్రీ నిధి కింద వాడుకున్న రుణాలను శతశాతం చెల్లింపు చేయడానికి క్లస్టర్ సీసీలద్వారా పొదుపుసంఘాల సభ్యులను సమాయత్తం చేశామని వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు అన్నారు. ఈ మేరకు బుధవారం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు మండల సమాఖ్య కార్యాలయం ద్వారా బ్యాంక్‌లనుంచి తీసుకున్న రుణాలతో సభ్యులు వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నారన్నారు. వ్యాపారాల కోసం బ్యాంక్‌ల నుంచి గడిచిన ఆర్థిక సంవత్సరంలో 898 మంది సభ్యులు రూ.535 కోట్లు వివిధ బ్యాంక్‌లనుంచి రుణం పొందినట్లు తెలియ జేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బ్యాంక్‌లకు చెల్లించాల్సిన రుణాలు నిర్దేశించిన గడువులోగా చెల్లించనున్నామన్నారు. క్లస్టర్ సీసీల ఆధ్వర్యంలో వీఓఏలు రుణాల చెల్లింపులపై దృష్టిసారించాలని కోరినట్లు చెప్పారు. అలాగే మండలసమాఖ్య సామాజిక తనిఖీకి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు.

గ్రామాల్లో కార్డన్‌సెర్చ్



సూరంపేటలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఆకస్మికంగా నిర్వహించారు. గ్రామాల్లో ద్విచక్రవాహనాలున్న ఇంటింటికీ వెళ్లి వాహనాల నంబర్ ప్లేట్‌లు, చాసీ నంబర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఎస్సై రాజేష్ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కొత్తగా వివిధ రకాల పనులపై వచ్చిన వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల గురించి తెలుసుకోవడం, చోరీకి గురైన వాహనాలను గుర్తించడానికి ప్రతిఇంటికీ వెళ్లి తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీతానగరం పోలీసులతో పాటు, బలిజిపేట మండల పోలీసు సిబ్బంది, స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ పోలీసులు వాహనాలు తనిఖీలో పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో జాగ్రత్త!

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో అప్రమత్తతే ప్రధానం
- ఆర్‌బీకేలు, వ్యవసాయ సొసైటీల వద్ద కొనుగోలు చేయడం ఉత్తమం



ఆర్‌బీకేలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనాలు



ప్రైవేటు దుకాణాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

గరుగుబిల్లి: ఖరీఫ్ సీజన్ సమయం దగ్గరవుతోంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భూమిని సిద్ధం చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు కూడా నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టాన్ని డీలర్లు పాటించాలని సూచిస్తున్నారు.

గుర్తింపు ఉంటేనే...

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తన రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలు ఉన్నవీలేనివీ గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలరు సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేస్తే మంచిది. హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనం రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను నిర్ధారించుకోవాలి. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

ఎరువులు విక్రయించాలంటే...

ఎరువులను విక్రయించే వారు ప్రభుత్వం నుంచి విధిగా గుర్తింపు పత్రం పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులను, వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు విధిగా బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ప్రమాణం లేని ఎరువులను డీలర్లు విక్రయించరాదు. బస్తాలపై చట్ట ప్రకారం నిర్దేశించిన ప్రామాణికాలు లేని ఎరువులను విక్రయించరాదు. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎరట్రి సిరాతో గుర్తు వేసి, పక్కన పెట్టేయాలి. అటువంటి వాటిని రైతులు కొనుగోలు చేయరాదు.

విత్తనశుద్ధి తప్పనిసరి

కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టి నట్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్‌డైజమ్‌ను కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి మండి కట్టి నారుమడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది. కార్బన్‌డైజమ్ కాకుండా విత్తనశుద్ధికి 'సూడోమోనాస్ ఫ్లోరసెస్' అనే జీవ శిలీంధ్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఈ శిలీంధ్రం వ్యవసాయశాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. సూడోమోనాస్ ఫ్లోరసెస్ మందును కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాముల మందును వినియోగించాలి. దీనివల్ల విత్తనం ద్వారా, భూమి నుంచి శిలీంధ్రం ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు. రైతులు సొంత విత్తనాల వినియోగం మంచిది.

మొలక పరీక్ష చేసుకోవాలి

రైతులు విత్తు కోవడానికి ఒక రోజు ముందు విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల మొలక శాతం పరీక్షించడంలేదు. ఇది మంచిది కాదు. విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలక శాతం పరీక్షించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజల పైబడి మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని, నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. లేదంటే విత్తన బస్తాను తిరిగి కొనుగోలు చేసిన చోట ఇచ్చేయాలి.

నాణ్యమైన విత్తనంతోనే దిగుబడులు



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు వస్తాయి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యసాయ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత వచ్చే ప్రసక్తి ఉండదు.

– ఆర్.విజయభారతి, మండల వ్యవసాయాధికారి, గరుగుబిల్లి